క్లుప్తంగా


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్ : పట్టణంతో పాటు మన్నూరు సబ్ స్టేషన్ పరిధిలోని ఎర్రబల్లి, సాయినగర్, సుదర్శన్ నగర్, మన్నూరు ప్రాంతాలలో మరమ్మతులు కారాణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్‌శాఖ ఏఈ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించగలరని కోరారు.

ఈటమాపురంలో పుష్పయాగం నేడు

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు శనివారం రాత్రి 7 గంటలకు పుష్పయాగాన్ని అంగరంగ వైభవంగా జరుపనున్నట్టు ఆలయ వైస్ చైర్మన్ గుండాల్ రెడ్డి తెలిపారు. ఈ పుష్పయాగానికి బెంగుళూరు నుంచి వివిధ రకాల పుష్పాలను తీసుకువచ్చినట్లు వారు చెప్పారు. పంచాయతీలోని మూడు గ్రామాలలో ఒక్కో రోజు ఒక్కో గ్రామంలో స్వామి వారిని ఊరేగించనున్నట్టు తెలియజేశారు. పుష్పయాగానికి వచ్చిన భక్తులందరికీ రాత్రికి గుండాల్ రెడ్డి, మహేశ్వరీ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన బాలాజీ స్వామి ఈ పుష్పయాగానికి పూర్తి సహకారం అందించారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవం


విశేష అలంకారంలో దుర్గమ్మ

గాలివీడు : మండల పరిధిలోని గుండ్లచెరువు గ్రామం పెద్దచెరువు ఒడ్డున వెలసిన గ్రామదేవత శ్రీ దుర్గాదేవి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం , వేదపండితులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు జరిపారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్న ప్రసాదాల వితరణ, ఆదివారం అలంకరించిన చాందినీబండ్లను ఊరేగిస్తూ మొక్కుల రూపంలో అమ్మవారికి బోనాలు సమర్పించుకోనున్నట్లు తెలియజేశారు.

రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

ఓబులవారిపల్లె : అన్ని విధాల అర్హులైన వారు స్థానిక పంచాయతీ కార్యాలయంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన రేషన్ కార్డులతోపాటు మార్పులు, చేర్పులు కూడా జరుగుతున్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన రేషన్ కార్డు దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతీ, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం వితరణ


ఆహారం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నందలూరు : మండల వ్యాప్తంగా సుపరిచితుడు మాజీ క్రీడాకారుడు అయిన దివంగత భూమిరెడ్డి వెంకటకృష్ణయ్య 6వ వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారి కుమారుడు లయన్ భూమిరెడ్డి మదన్ సౌజన్యంతో శుక్రవారం బస్టాండ్ కూడలిలో పేదలకు పెద్దఎత్తున అల్పాహారాన్ని వితరణ చేశారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట : పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దకొత్తపల్లి గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యాన పంటల సాగు చేసే వారికి ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలను తెలియజేశారు. ఆసక్తి ఉన్న రైతులు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఉపాధి సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

పడిగాపులు.. అడియాసలు!

కూటమి పాలనలో కళగానే సొంతిళ్లు

- ఏడాది కావొస్తున్నా అమలుకాని హామీ
- గ్రామసభల్లో అర్జీల స్వీకరణ
- లబ్ధిదారుల జాబితా ప్రకటనలో జాప్యం
- ఒక్క ఇంటి నిర్మాణానికి కూడా అడుగులు పడని వైనం


సంబేపల్లె మండలం దాసరివాండ్లపల్లెలోని జగనన్న కాలనీ


గత ప్రభుత్వంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ఇంటి పత్రాన్ని అందిస్తున్న అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : అధికారమే పరమావధిగా కూటమి పార్టీలు ఉమ్మడి మేనిఫెస్టోలో అన్ని వర్గాలను ఆకట్టుకునేలా హామీలను విడుదల చేశారు. దీంతో ప్రజలు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ లబ్ధి చేకూరుస్తాము అని నాటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలను ప్రజలు విశ్వసించారు. దీంతో కూటమి నాయకుల హామీలను నమ్మిన ప్రజలు ఎన్నికల్లో వారికి అండగా నిలిచారు. తీరా అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు ఏడాది కావొస్తున్న ఇచ్చిన హామీలు పట్టకపోగా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతూ పథకాలపై ప్రజల దృష్టి లేకుండా చేయడంలో నిమగ్నమయ్యారు. ఏడాది కాలంగా పథకాలు ఎప్పుడు వస్తాయో అని అటు రైతులు ఇటు మహిళలతోపాటు అన్ని వర్గాల వారు ఎదురుచూస్తున్నారు. పథకాలు అందితే కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు సాయపడుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి అడియాసలుగానే మిగిలిపోయాయి.

అర్హులకు మూడు సెంట్లు అంటూ..

అర్జీ పెట్టుకున్న ప్రతి అర్హుడికి గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సాయంతో కలిపి రూ.4 లక్షలు అందజేస్తామని, ఐదేళ్లలో 25 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని కూటమి మేనిఫెస్టోతోపాటు అసెంబ్లీ సాక్షిగా బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు రాజంపేట, రాయచోటి, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లో ఏ ఒక్కరికి ఇంటి స్థలాలు కానీ ఇళ్ల నిర్మాణాలకు చేయూతగాని అందించిన పాపానపోలేదు. గ్రామసభల పేరుతో నెల రోజులకు పైగా అధికారులు సమావేశాలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఇందులో అధిక సంఖ్యలో గృహ వసతి అందించాలని కోరుతూ వచ్చినవే అధికం. గ్రామసభల తరువాత నెల రోజులకు సమస్యను పరిష్కరిస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు (మూడు నెలలు పూర్తయినా) ఒక్క అర్జీని పరిష్కరించకపోవడంతో అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలో తమ సమస్యలు, తమ కళలు తీరే అవకాశం ఉండదేమోనన్న భావనలో ప్రజలు ఉన్నారు.


సంబేపల్లె మండలంలోని పీఎన్ పల్లిలో జరిగిన గ్రామసభకు హాజరైన మంత్రి మండిపల్లి

సంబేపల్లె మండలంలో 1160 అర్జీలు

రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె మండలంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలలో 1160 మంది తమ దరఖాస్తులను ఇంటి స్థలం, ఇళ్ల నిర్మాణాలకు సాయం అందించాలని కోరారు. మూడు నెలల అనంతరం అధికారులు అర్జీలను పరిశీలించి 860 గృహాలను మంజూరు చేశారు. అయితే మంజూరు చేసిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు ప్రొసిడింగ్స్ కూడా అందించకపోవడంతో ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఇంత జాప్యం తాము ఏ ప్రభుత్వంలో చూడలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పేరు మార్చి ప్రజలను ఏమార్చేలా..

మనం చేసేది ఏమీ లేకుంటే పక్కోడు చేసింది మన ఖాతాలో వేసుకోవడమే అనే చందంగా కూటమి ప్రభుత్వ తీరు కనిపిస్తోంది. సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిపల్లెలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు వైఎస్సార్ జగనన్న కాలనీ పేరుతో ఏర్పాటు చేసింది. కాలనీలో వేలాది మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణం పేరుతో ఊరును నిర్మించిన వైఎస్ జగన్, గడికోట శ్రీకాంత్‌రెడ్డిలకు ఎక్కడ పేరు దక్కుతుందోనని కూటమి నాయకులు కుయుక్తులు పన్నారు. నారాయణరెడ్డిపల్లెలోని జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఆర్చ్‌కు ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీ పేరును ఇటీవల తొలగించి పీఎంఏవై ఎన్టీఆర్ కాలనీ అని పేరు మార్చారు. సొమ్ము ఒక్కరిది సోకు ఒకరిది అనే తీరుగా లబ్ధిదారుల గుర్తించి కాలనీ ఏర్పాటు చేసి.. వసతులు కల్పించింది ఒకరైతే.. దానిని తమ ప్రభుత్వం చేసింది అనేలా కూటమి నాయకులు వేస్తున్న పన్నాగాలను చూసి ప్రజలు ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



నారాయణరెడ్డిపల్లిలోని జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలోని ఆర్చ్‌కు పేరు మార్చిన దృశ్యం

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఊర్లు

ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి పథకాన్ని అమలు చేసిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ప్రతి పథకాన్ని ప్రజలకు అందించిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే చెల్లింది. రాయచోటి నియోజకవర్గంలో అర్జీ పెట్టుకున్న ప్రతి అర్హుడికి ఇంటి స్థలం కేటాయించడమే కాక వారికి త్వరితగతిన పత్రాలు అందించడంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి క్రియాశీలకంగా పని చేశారు. ఆయన కృషితో సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ జిల్లాలో రెండో అతిపెద్ద కాలనీగా రూపాంతరం చెందింది. కాగా ఒక్క సంబేపల్లె మండలంలోనే 1473 పక్కాగృహాలు, 14 లేఅవుట్‌లు ఉన్నాయి. అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చొరవతో రాయచోటి నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో దాదాపు 20 వేలకు పైగా పక్కాగృహాలు, 93 జగనన్న కాలనీలు మంజూరవ్వడం రికార్డు అనే చెప్పవచ్చు. వేల కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసిన వైఎస్ జగన్, గడికోట శ్రీకాంత్‌రెడ్డిల ద్వారానే సాధ్యమైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.


ఊరును తలపిస్తున్న నారాయణరెడ్డిపల్లెలోని జగనన్న కాలనీ

ఘనంగా వసంతోత్సవం


గ్రామంలో ఊరేగుతున్న రేణుకా ఎల్లమాంబ


వసంతోత్సవంలో యువకుల సందడి

సిద్దవటం : మాచుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా ఎల్లమాంబ తిరునాల చివరి రోజు శుక్రవారం వసంతోత్సవం వేడుకను స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి పల్లకి ఇళ్ల వద్దకు రాగానే మహిళలు అమ్మవారికి కాయా, కర్పూరాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఊరేగింపు వెంబడి మహిళలు, యువకులు పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు వసంతాలు చల్లుకుంటూ ఉల్లాసంగా పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

సిద్దవటం : గ్రామాలలో దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పి. కొత్తపల్లె ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి తెలిపారు. మండలంలోని పి.కొత్తపల్లె పీహెచ్‌సీ పరిధిలోని మాచుపల్లెలో శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవంలో భాగంగా పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా నీరు నిలువలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె అన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ మురుగు నీరు నిల్వ లేకుండా, కొళాయిలు లీకేజ్ కాకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు పుట్టి వృద్ధి చెందుతాయన్నారు. డెంగ్యూ వ్యాధి ఎలా వ్యాపిస్తుంధి, వ్యాధి లక్షణాలు, చికిత్స విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్‌లు పద్మావతి, మౌలాలి, రామ్మోహన్, ఆరోగ్య కార్యకర్తలు మేరి వాసవి, రెడ్డి రాణి, ఆశ వర్కర్‌లు, స్థానికులు పాల్గొన్నారు.


సిద్దవటం: మాచుపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

నందలూరు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో లార్వాను నిర్మూలించాలని తెలిపారు. డెంగ్యూ నివారణ పద్ధతులు, అనవసర నీటి నిల్వలు, అపరిశుభ్ర ప్రదేశాలు పరిశీలించడం, వాటిని నిల్వ లేకుండా శుభ్రపరచడం, నీటి నిల్వ ఉంచిన పాత్రలపై మూతలు పెట్టడం గురించి విశదీకరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటనారాయణ, పీహెచ్ఎన్ శైలజ, సూపర్‌వైజర్ సునీల్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


నందలూరు: ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో ర్యాలీ

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

సుండుపల్లె : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో పీసీఎస్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఐ సహకారంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎయిడ్స్ నియంత్రణ గురించి అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూడకుండా సమాజంలో కలసిమెలసి జీవించే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అయూబ్‌ఖాన్, కానిస్టేబుల్, ఓఆర్‌డబ్ల్యూ సుహాసిని, రమణమ్మ, ప్రజలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారి స్వాతి

కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలి

వీరబల్లి : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని పీఓసీడీ రామలక్ష్మీ తెలిపారు. శుక్రవారం సానిపాయి పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న కిశోర బాలికలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కిశోర బాలికలలో రక్తహీనత లేకుండా చూడాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఆరోగ్యం పట్ల వారు జాగ్రత్తలు పాటించే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలితమ్మను కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే పోషక పదార్థాలు, ఆహార పదార్థాలను వారికి సక్రమంగా అందిస్తూ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం కిశోర బాలికలతో అంగన్‌వాడీ గ్రామ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కిశోర బాలికల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రైతే దేశానికి వెన్నెముక

ఓబులవారిపల్లె : రైతే దేశానికి వెన్నెముక అని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతరాజుపేటలోని వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కిసాన్ మేళా - 2025ను నిర్వహించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రిబ్బన్ కట్ చేసి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా పంటలకు మద్దతు ధర, సాగునీటి ప్రాజెక్టులు మార్కెటింగ్ సదుపాయాలు, హార్టికల్చర్ అభివృద్ధి చేపడుతున్న ప్రోత్సాహక కార్యక్రమాలు గురించి ఆయన ప్రస్తావించారు. కిసాన్ మేళాలో బొప్పాయి, మామిడి, నిమ్మ తదితర స్టాళ్లు ఏర్పాటు చేయగా, జిల్లా నలుమూలల నుంచి రైతులు పాల్గొన్నారు. అనంతరం అవార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మేళాలో స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

సర్టిఫైడ్ మోటివేషనల్ ట్రైనర్‌గా ఇంతియాజ్

చిట్వేలి : మండల కేంద్రానికి చెందిన గాడి ఇంతియాజ్ అహ్మద్ ఇంపాక్ట్ సర్టిఫైడ్ మోటివేషనల్ ట్రైనర్‌గా అర్హత సాధించారు. ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్, ట్రైన్ ద ట్రైనర్ తదితర సెషన్లు విజయవంతంగా పూర్తి చేసి ఇటీవల అర్హత సాధించినట్టు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలోని రామి గెస్ట్‌లైన్ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొని గత ఆదివారం సంస్థ ప్రముఖులు సోను శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్, తబసున్నీసా బేగం , విక్రమ్ రెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నారు. ఇంటికో స్పీకర్, ఊరుకో ట్రైనర్ అనే నినాదంతో జ్ఞానాన్ని పంచుతూ యువత ఎంచుకున్న రంగాలలో ఉన్నస్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగేలా కృషి చేస్తున్న ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. తనకు సహకరించిన తబసున్నీసా, డాక్టర్ జ్యోత్స్న, నాథమునికి కృతజ్ఞతలు తెలిపారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న ఇంతియాజ్ అహ్మద్

దేవుడి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లి : శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ప్రార్థించారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లి మండలంలోని పందిళ్లపల్లి గ్రామం జమకల గుట్ట వడ్డిపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేవుడి దయ వల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వైభవంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, సర్పంచ్‌లు మహేంద్ర బాబు, జనార్దన్ రెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్ రెడ్డి, ఢిల్లీ విశ్వనాథరెడ్డి, లక్ష్మీరెడ్డి, రమణ, ఉపసర్పంచ్ రాజారెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, జాకీర్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి, నాయకులు

అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయండి

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు మండలం తూర్పుపల్లి ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య కోరారు. శుక్రవారం తూర్పుపల్లి కాలనీ గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని చిన్న పిల్లలు, గ్రామస్తులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జయరామయ్యమాట్లాడుతూ దాదాపు 50 గృహాలు ఎస్సీ కాలనీలో ఉన్నాయని, పిల్లలు అంగన్‌వాడీ సెంటర్ లేక మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని, కావున వెంటనే నాయకులు, అధికారులు స్పందించి అంగన్‌వాడీ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి మండల వ్యవసాయ కార్యదర్శి మల్లిక, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు, గ్రామస్తులు

వాహన తనిఖీ


వాహనాల రికార్డులను పరిశీలించి సూచనలు చేస్తున్న రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్

చిన్నమండెం : వాహనచోధకులు వాహనాల రికార్డులను తప్పక దగ్గర ఉంచుకోవాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కడప - బెంగళూరు జాతీయ రహదారిపై చిన్నమండెం పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనాల తనిఖీ చేశారు. తనిఖీలో రికార్డులను సీఐ పరిశీలించారు. హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. రికార్డు లేని వాహనాలను నడిపినట్లయితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఎస్ఐ సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పింఛన్లు పంపిణీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మలకాటిపల్లి క్రాస్ వద్ద ఉన్న నూరుల్లా ఇస్లాం ట్రస్టు ఆధ్వర్యంలో మదరసా వద్ద ట్రస్టు అధినేత అబ్దుల్ సుబహాన్ శుక్రవారం పేదలకు పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, ఒంటిమిట్ట, నందలూరు, సిద్దవటం మండలాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ఇమాములు, మౌజములకు, నిరుపేదలకు ప్రతినెల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామన్నారు. అలానే నిత్యావసర సరుకైనా మిరపకాయలు అందజేశారు. గత కొద్ది సంవత్సరాల నుంచి పేదలకు సహాయ సహకారాలు సంస్థ తరపున ఆదుకుంటున్నామని పేర్కొన్నారు.

పరామర్శ

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు జాకీర్ బావమరిది, సచివాలయ ఉద్యోగి వాజిద్ ఇటీవల విద్యుత్ షాక్ బారీనపడి గాయాలపాలయ్యాడు. చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న వాజిద్‌ను శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై వారు ఆరాతీసి సంబంధిత శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి క్షతగాత్రుడికి న్యాయం చేయాలని కోరారు.